రాష్ట్ర ప్రజలకు గవర్నర్ సంక్రాంతి శుభాకాంక్షలు

హైదరాబాద్, జనవరి 12 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర ప్రజలకు భోగి, సంక్రాంతి పర్వదినాల సందర్భంగా ప్రముఖులు శుభాకాంక్షలు తెలిపారు. పాడిపంటలు, సుఖశాంతులతో ప్రజలు తులతూగాలని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ కాంక్షించారు. పండుగలు మన వారసత్వ ప్రతీకలని పేర్కొన్నారు. సంస్కృతి, సంప్రదాయాలకు అత్యంత విలువ ఇచ్చే రాష్ట్ర ప్రజలు నిత్యం సుఖశాంతులతో విలసిల్లాలని ఆయన అభిలషించారు.

సిరిసంపదలతో తులతూగాలి: ఎంపీ వద్దిరాజు

సంక్రాంతి పండుగ సందర్భంగా ఎంపీ వద్దిరాజు రవిచంద్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి ఇల్లు సిరిసంపదలతో తులతూగాలని ఆకాంక్షించారు. బంధుమిత్రులతో కలిసి సంక్రాంతి సంబురాలను ప్రశాంతంగా జరుపుకోవాలని తెలిపారు.

మూడు రోజుల్లో ఏపీ వైపు 1.78లక్షల వాహనాలు

- హైదరాబాద్ -విజయవాడ రహదారిపై వాహనాల రద్దీ

హైదరాబాద్, జనవరి 12 (నమస్తే తెలంగాణ): సంక్రాంతి పండుగ నేపథ్యంలో పట్టణ వాసులందరూ పల్లె బా ట పట్టారు. దీంతో హైదరాబాద్ నుం చి విజయవాడ, కర్నూలు, తమిళనా డు వెళ్లే దారులన్నీ వాహనాలతో కిక్కిరిసిపోయాయి. ప్రధానంగా హైదరాబాద్ – విజయవాడ జాతీయ రహదారిపై వాహనాల రద్దీ కొనసాగుతున్నది. చౌటుప్పల్, తుప్రాన్‌పేట, ఆందోల్ మైసమ్మ, పంతంగి టోల్ ప్లాజా తదిత ర ప్రాంతాల వద్ద పోలీసులు ట్రాఫిక్ ను క్రమబద్ధీకరిస్తున్నారు. మూడు రో జుల్లో 11టోల్ గేట్ల ద్వారా ఏపీ వైపు సుమారు 1,78,000 వాహనాలు వెళ్లాయి.

అమ్మకానికి మదర్ డెయిరీ ఆస్తులు!

మొదటిపేజీ తరువాయి...

యూనియన్ లిమిటెడ్ (మదర్ డెయిరీ) మూడున్నర దశాబ్దాల కాలంగా పాడి ఉత్పత్తిదారులకు ఆసరాగా నిలుస్తున్నది. ఉమ్మడి నల్లగొండ, రంగారెడ్డి జిల్లాల పరిధిలో 24 చిల్లింగ్ సెంటర్లు, 32 వేల మంది సభ్యులు, 432 సొసైటీల ద్వారా రోజుకు లక్ష లీటర్ల పాల సేకరణ జరుగుతున్నది. 3లక్షల మంది వినియోగదారులకు పాలు, పాల ఆధారిత ఉత్పత్తులను అందిస్తున్నది.

రూ.60కోట్ల అప్పులు అంటూ..

మదర్ డెయిరీ 26వ సర్వసభ్య ప్రత్యేక సమావేశం ఏర్పాటుకు ఈ నెల 9న సభ్యులకు నోటీసులు జారీ చేశారు. ఫిబ్రవరి 2న హయత్ నగర్‌లో సమావేశం ఉంటుందని పేర్కొన్నారు. 'నార్మాక్ యూనియన్ రూ.60కోట్ల వరకు ఆర్థిక భారం ఏర్పడి రోజువారీ కార్యక్రమాలు నిర్వహించేందుకు యూనియన్ స్థిరాస్తులు విక్రయించడానికి చర్చించి నిర్ణయం తీసుకుకోవడానికి..' అని ఎజెండాలో స్పష్టం చేశారు.

ఉమ్మడి నల్లగొండలో 30.5 ఎకరాల అమ్మకం

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో యూనియన్ పేరు మీద కొనుగోలు చేసిన భూములను అమ్మాలని స్కెచ్ వేశారు. నల్లగొండ జిల్లాలోని చిట్యాల పరిధిలో 29 ఎకరాలు, మిర్యాలగూడ పరిధిలోని 1.5 ఎకరాల భూమిని విక్రయించాలని ఎజెండాలో పేర్కొన్నారు.

గతంలో ఒప్పుకోని బీఆర్ఎస్ సర్కారు

పాడి రైతులకు వరంగా ఉన్న డెయిరీ ఆస్తులను అమ్మేందుకు నాడు కేసీఆర్ ప్రభుత్వం ససేమిరా అంది. గతేడాది సెప్టెంబర్‌లో మదర్ డెయిరీ ఎన్నికల సందర్భంగా మంత్రులు, ఎమ్మెల్యేలు క్యాంపులకు విజయ డెయిరీ మాదిరిగానే మదర్ డెయిరీకి గ్రాంట్లు ఇప్పించి, అప్పులు తీర్చేలా ఆదుకుంటామని ప్రకటించారని సభ్యులు చెబుతున్నారు. లీటరుకు రూ.4 బోనస్ ఇస్తామని చెప్పి పాల రేట్లను తగ్గిస్తూ వచ్చారని వాపోతున్నారు.

ఆస్తులు విక్రయిస్తే ఉద్యమమే..

మదర్ డెయిరీ ఆస్తులు అమ్మడానికే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందా? ఎన్నికల సమయంలో మంత్రి కోమటిరెడ్డి, విప్ బీర్ల ఐలయ్య చెప్పిన గ్రాంట్లు ఏమయ్యాయి..? లీటరుపై నాలుగు రూపాయల బోనస్ ఇవ్వకపోగా రేట్లు తగ్గించడం దారుణం. ఆస్తుల విక్రయం నిర్ణయాన్ని విరమించుకోవాలి. పట్టించుకోకుండా ముందుకు వెళ్తే పెద్దఎత్తున ఉద్యమం చేస్తాం.

- దొంతిరి సోమిరెడ్డి, మదర్ డెయిరీ మాజీ డైరెక్టర్

- హైవేపై కిక్కిరిసిన వాహనాలు

హైదరాబాద్ – విజయవాడ 65వ జాతీయ రహదారిపై ఆదివారం వాహనాలు కిక్కిరిసిపోయాయి. చౌటుప్పల్ మండలం పంతంగి టోల్‌ప్లాజా వద్ద ఇరువైపులా 16 టోల్‌బూత్‌లు ఉండగా.. విజయవాడ వైపు 11 బూత్‌లను తెరిచారు. గత సంక్రాతికి 77వేల వాహనాల రికార్డు ఉండగా.. ఇప్పుడు 6వేలు అధికంగా వెళ్లడంతో ఆ రికార్డు బ్రేక్ అయ్యింది.

– చౌటుప్పల్

రిటైర్మెంట్ సడలింపుపై వీసీల గుర్రు

- రెగ్యులర్ వారికి ఒకలా.. కాంట్రాక్ట్ వారికి మరోలా!
- 60 ఏండ్లు దాటిన కాంట్రాక్ట్ బోధకుల కొనసాగింపు
- రెగ్యులర్ ప్రొఫెసర్లకూ అరవై ఏండ్లకే పదవీ విరమణ
- ఉన్నత విద్యామండలి తీరును వ్యతిరేకిస్తున్న వీసీలు

హైదరాబాద్, జనవరి 12 (నమస్తే తెలంగాణ) : ప్రభుత్వ నిబంధనలంటే అందరికి సమానం. ఇక రిటైర్మెంట్ విషయంలో ఎవరికీ మినహాయింపేం కాదు. కానీ ఉన్నత విద్యామండలి మాత్రం ఈ విషయాన్ని విస్మరించి నడుచుకుంటున్నది. రెగ్యులర్ వారికి ఒకలా.. కాంట్రాక్ట్ వారికి మరోలా నిబంధనలను అమలుచేయడానికి ప్రయత్నిస్తున్నది. ఒకవైపు రెగ్యులర్ ప్రొఫెసర్లు 60 ఏండ్లకే పదవీ విరమణ పొందుతుండగా, 60 ఏండ్లు దాటిన కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లను తిరిగి కొనసాగించవచ్చని ఆదేశాలిచ్చింది. వర్సిటీలకు మండలి లేఖలు రాసింది. ఇది వివాదాస్పదమైంది. ఈ లేఖపై ఉన్నత విద్యామండలి వర్సెస్ వర్సిటీలు అన్నట్టుగా పరిస్థితి తయారైంది. ఇటీవల ఉన్నత మండలి అన్ని వర్సిటీల వీసీలతో నిర్వహించిన సమావేశంలో లేఖ ప్రస్తావన రాగా, ఓయూ, మహాత్మాగాంధీ, బీఆర్ అంబేద్కర్ వర్సిటీల వైస్ చాన్స్‌లర్లు తీవ్రంగా వ్యతిరేకించారు. ఇదేం విధానమని, ఎలా కుదురుతుందని మండలి అధికారులను నిలదీసినట్టు తెలిసింది. అటానమస్ హోదా గల వర్సిటీల విషయంలో మండలి జోక్యం తగదని కొందరు వీసీలు అన్నట్టుగా ప్రచారం జరుగుతున్నది. మండలి కేవలం సూచనలు, సలహాలు మాత్రమే ఇవ్వాల్సి ఉంటుందని చెప్పినట్టుగా అధికారుల్లో చర్చలు నడుస్తున్నాయి.

అవసరముంటేనే తీసుకోవాలని సూచించాం

వర్సిటీల్లో అవసరముంటే 60 ఏండ్లు దాటిన వారిని తీసుకోవాలని సూచన మాత్రమే చేశాం. అవసరాన్ని బట్టి పరిశీలించమన్నాం. అదేం జీవో కాదు. కేవలం సర్క్యులర్ మాత్రమే. అయినా కొనసాగించాలా.. లేదా అన్నది వీసీల ఇష్టం. తప్పనిసరిగా అమలుచేయాలన్న నింబంధనలేం లేవు.

- ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి

'సంక్రాంతి' లింక్ క్లిక్‌చేస్తే లూటీ

- ప్రమాదకర మాల్‌వేర్‌తో సైబర్ నేరగాళ్ల కొత్త ఎత్తుగడ
- జాగ్రత్తలు పాటించాలంటున్న సైబర్ సెక్యూరిటీ బ్యూరో

హైదరాబాద్, జనవరి 12 (నమస్తే తెలంగాణ): 'ఎంజాయ్ సంక్రాంతి స్పెషల్ ఫ్రీ రీచార్జ్.. 4 జీబీ డాటా వ్యాలిడ్ టిల్ యువర్ కరెంట్ ప్యాక్ వ్యాలిడిటీ. ఆల్సో గెట్ 2 జీబీ డాటా ఆన్ యువర్ నెట్స్ రీచార్జ్' అంటూ ఓ సైబర్ మోసగాడి నుంచి ఫేక్ మెసేజ్. 'సంక్రాంతి పండుగ సందర్భంగా మీ నంబర్‌కు బంపర్ ఆఫర్ వచ్చింది. మీకు 10 జీబీ డాటా ఉచితంగా అందించబడుతుంది. దీని కోసం మేము పంపిన లింక్‌ను క్లిక్ చేసి, మీ వివరాలు పొందుపర్చండి. ఆ తర్వాత ఆ మెసేజ్‌ను 10 మందికి పంపితే మీకు పూర్తి ఉచితంగా 10 జీబీ డాటా లభిస్తుంది' అంటూ మరో కేటుగాడి మెసేజ్. ఇలా.. సైబర్ నేరగాళ్లు సోషల్ మీడియాలో ప్రకటనలు, మెసేజ్‌లతో అమాయకులకు వల వేసి డబ్బులు లూటీ చేస్తున్నారు. దీనిపై సైబర్ సెక్యూరిటీ బ్యూరో అప్రమత్తమైంది.ఇలాంటి ప్రకటనలకు ఎవరూ ఆశపడొద్దని, లింకులను క్లిక్ చెయ్యొద్దని సూచిస్తున్నది.

నా కుమారుడికి గుర్తింపు ఇవ్వలేదు

ఓపెన్ ఏఐపై సుచిర్ బాలాజీ తల్లి ఆరోపణ ● మరణంపై ఎఫ్‌బీఐ విచారణకు డిమాండ్

న్యూఢిల్లీ, జనవరి 12: చాట్‌జీపీటీ అభివృద్ధిలో తన కుమారుడు ఎంతో కృషి చేసినప్పటికీ ఓపెన్‌ఏఐ సంస్థ మాత్రం తగిన గుర్తింపు ఇవ్వలేదని సుచిర్ బాలాజీ తల్లి అపర్ణారావు ఆరోపించారు. చాట్‌జీపీటీని అభివృద్ధి చేసిన ఓపెన్‌ఏఐలో సుచిర్ బాలాజీ నాలుగేండ్లు పని చేసి 2023 ఆగస్టులో రాజీనామా చేశారు. ఆ తర్వాత ఓపెన్‌ఏఐ అనైతిక చర్యలకు పాల్పడుతున్నదని ఆయన ఆరోపించి, పలు ఆధారాలను బయటపెట్టారు. ఈ క్రమంలో గత నవంబర్‌లో శాన్ ఫ్రాన్సిస్కోలోని తన అపార్ట్‌మెంట్‌లో సుచిర్ బాలాజీ అనుమానాస్పద స్థితిలో మరణించారు. ఈ విషయమై ఆయన తల్లి అపర్ణారావు మారియా నాఫల్ అనే సోషల్ మీడియా ఇన్ ఫ్లుయెన్సర్‌తో మాట్లాడుతూ..'చాట్‌జీపీటీని వేగంగా, సమర్థంగా అభివృద్ధి చేయడానికి నా కొడుకు తోడ్పడ్డాడు. కానీ తను మరణించే వరకు తన పనికి గుర్తింపు దక్కలేదనే బాధ అతడిలో ఉండేది. ఇప్పుడు కూడా సుచిర్ సేవలకు ఓపెన్‌ఏఐ తగిన గుర్తింపు ఇవ్వకపోవడం దురదృష్టకరం' అని ఆమె పేర్కొన్నారు. తమ కుమారుడి మరణం ఆత్మహత్యలా లేదని, అసలు నిజాన్ని తేల్చడానికి ఎఫ్‌బీఐ విచారణ జరిపించాలని ఆమె డిమాండ్ చేశారు.

సంక్రాంతి స్పెషల్ బాదుడు

- ప్రయాణికులను నిలువునా దోచుకుంటున్న ఆర్టీసీ
- జేబీఎస్ నుంచి మెదక్‌కు రూ.240, నిర్మల్‌కు 650

ఆదివారం జేబీఎస్ నుంచి మెదక్‌కు ఇద్దరికి ఇచ్చిన టికెట్ ధర

మెదక్, జనవరి 12 (నమస్తే తెలంగాణ) : సంక్రాంతి పండుగ వేళ ప్రయాణికులపైన స్పెషల్ పేరిట ఆర్థిక భారం మోపుతున్నది రాష్ట్ర రోడ్డు రవాణాసంస్థ (టీజీఎస్ఆర్‌టీసీ). పండుగకోసం స్వగ్రామాలకు వెళ్లే ప్రయాణికులను నిలువునా దోచుకుంటున్నది. స్పెషల్ బస్సుల పేరిట బోర్డులు తగిలించి ముక్కుపిండి అధిక చార్జీలు వసూలు చేస్తున్నది. మహిళలకు ఉచిత ప్రయాణానికి అవసరమైన మేరకు బస్సుల సంఖ్య పెంచకపోవడంతో ప్రయాణికుల నుంచి తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అధిక చార్జీలు పెట్టి కూడా దూర ప్రాంతాలకు నిలబడి పోవాల్సి వస్తున్నదని పురుష ప్రయాణికులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. నిర్మల్, మెదక్ జిల్లాలోని మెదక్, నర్సాపూర్‌తో పాటు నిజామాబాద్ జిల్లా బాన్సువాడ, బోధన్, ఎల్లారెడ్డి నుంచి నడిపిస్తున్న కొన్ని బస్సులకు దూర ప్రాంతాల బోర్డులు వేసి స్పెషల్ పేరుతో అధికంగా చార్జీలు వసూలు చేస్తున్నారు. ఇదేమని ప్రశ్నిస్తే ఉన్నతాధికారుల నుంచే తమకు ఆదేశాలు ఉన్నాయంటూ దబాయిస్తున్నారు. ఆదివారం జేబీఎస్ నుంచి మెదక్ డిపోకు చెందిన ఎక్స్‌ప్రెస్ బస్సులో డ్రైవర్‌తో ప్రయాణికులు ఘర్షణకు దిగారు. మెదక్ డిపో నుంచి సంక్రాంతి స్పెషల్‌గా ఎక్స్‌ప్రెస్ బోర్డుతో వచ్చిన టీఎస్ 35 జడ్ 0022 బస్సు ఉదయం 7:30 గంటలకు జేబీఎస్‌కు చేరుకుంది. జేబీఎస్‌లో ఆ బస్సు ఎక్కిన ప్రయాణికులతో డ్రైవర్ టికెట్ ఇచ్చి అధికంగా వసూలు చేశాడు. జేబీఎస్ నుంచి మెదక్‌కు రూ.160 చార్జి కాగా, అదనంగా రూ.80 వసూలు చేసి రూ.240 టికెట్ ఇచ్చాడు. అక్కడే ఉన్న మెదక్ డిపో మేనేజర్‌ను ఇదేమిటని అడుగగా, సంక్రాంతి పండుగ సందర్భంగా స్పెషల్ పేరిట చార్జీలు వసూలు చేస్తున్నామని సమాధానమిచ్చారు. జేబీఎస్ నుంచి నిర్మల్‌కు 650 వసూలు చేశారు.

కొత్తగూడెంలో రౌడీ ముకల హల్ చల్

- విధుల్లో ఉన్న కానిస్టేబుల్‌పై దాడి
- పైరవీలకు తెరలేపుతున్న రాజకీయ నాయకులు

కొత్తగూడెం క్రైం, జనవరి 12: రౌడీముకలు, ఆకతాయిల ఆకృత్యాలు రోజురోజుకీ పెరిగిపోతున్నాయి. విచ్చలవిడిగా వ్యవహరిస్తూ.. కొందరు రాజకీయ నాయకుల అండదండలతో రౌడీల్లా వ్యవహరిస్తున్నారు. ఇందులో భాగంగానే విధుల్లో ఉన్న ఓ కానిస్టేబుల్‌పై కొందరు రౌడీముకలు దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన ఘటన ఆదివారం కొత్తగూడెం పట్టణంలో సంచలనంగా మారింది. వివరాలిలా ఉన్నాయి. జిల్లా కేంద్రమైన కొత్తగూడెం పట్టణంలోని గాజులరాజం బస్తీకి చెందిన ప్రమోద్, ఉదయ్, బూడిదగడ్డలో నివాసముంటున్న పవన్ వారి స్నేహితులతో కలిసి శనివారం రాత్రి గాజులరాజం బస్తీలో నడిరోడ్డుపై గ్రూపులు కట్టారు. అదే సమయంలో బ్లూ కోల్ట్ విధి నిర్వహణలో భాగంగా పాయింట్ బుక్ ఎంట్రీ చేసేందుకు అక్కడికి వచ్చిన త్రీ టౌన్ కానిస్టేబుల్ శేఖర్ సదరు యువకులను 'ఈ సమయంలో ఇక్కడ ఏం చేస్తున్నారు?' అని ప్రశ్నించాడు. దీంతో వారు దురుసుగా సమాధానం చెప్పడంతో కానిస్టేబుల్ శేఖర్ తన ఫోన్‌తో వారి ఫొటో తీసేందుకు ప్రయత్నించాడు. దీంతో కోపోద్రేకంతో ఊగిపోయిన పవన్, ప్రమోద్, ఉదయ్‌లు విధుల్లో ఉన్న కానిస్టేబుల్ అని కూడా చూడకుండా దాడి చేసి తీవ్రంగా గాయపరిచి పారిపోయారు. ఈ దాడిలో శేఖర్ వేలు పాక్షికంగా విరిగినట్లు తెలుస్తోంది. శేఖర్ తనపై అధికారులకు విషయం తెలుపడంతో వారు ఘటనా స్థలానికి చేరుకుని ఆసుపత్రికి తరలించారు. బాధితుడైన కానిస్టేబుల్ శేఖర్ చేసిన ఫిర్యాదు మేరకు త్రీ టౌన్ ఇన్‌స్పెక్టర్ కాగితోజు శివప్రసాద్ నేతృత్వంలో నిందితులు పవన్, ప్రమోద్, ఉదయ్‌లపై 121(1) బీఎన్ఎస్ ప్రకారం కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు. కాగా, కానిస్టేబుల్‌పై దాడికి పాల్పడిన సదరు రౌడీ ముకలు కొందరు స్థానిక రాజకీయ నాయకులను ఆశ్రయించి పైరవీలకు తెరలేపుతున్నట్లు సమాచారం.

ఛత్తీస్‌గఢ్‌లో ఎదురుకాల్పులు..

- ఐదుగురు మావోయిస్టులు హతం
- మృతుల్లో ఇద్దరు మహిళలు.. ముగ్గురు పురుషులు..

కొత్తగూడెం క్రైం, జనవరి 12: ఛత్తీస్‌గఢ్ దండకారణ్యంలో మావోయిస్టులు, భద్రతాదళాలకు మధ్య ఆదివారం జరిగిన ఎదురుకాల్పుల్లో ముగ్గురు నక్సల్స్ హతమయ్యారు. ఈ ఘటన బీజాపూర్ జిల్లాలో జరిగింది. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లా మద్దేడ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఇంద్రావతి నేషనల్ పార్క్ అడవుల్లో మావోయిస్టులు ఉన్నారన్న విశ్వసనీయ సమాచారంతో డీఆర్‌జీ, కోబ్రా, ఎస్టీఎఫ్ భద్రతా దళాలు ఆ ప్రాంతంలో సెర్చింగ్ ఆపరేషన్స్ నిర్వహించాయి. ఈ క్రమంలో ఉదయం మావోయిస్టులు తారసపడి జవాన్లపై కాల్పులు జరిపారు. భద్రతాదళాలు వెంటనే అప్రమత్తమై ఎదురు కాల్పులు జరిపాయి. ఇరువర్గాల మధ్య సుమారు 30 నిమిషాలపాటు భీకర పోరు జరిగింది. కాసేపటికి జవాన్ల ధాటికి తాళలేక మావోయిస్టులు కాల్పులు జరుపుతూనే దట్టమైన అటవీ మార్గంలోకి పారిపోయారు. కాల్పుల విరమణ అనంతరం జవాన్లు ఆ ప్రాంతాన్ని తమ ఆధీనంలోకి తీసుకొని గాలింపు చేపట్టారు. ఈ క్రమంలో ఎదురుకాల్పుల్లో ఐదుగురు మావోయిస్టుల మృతదేహాలను గుర్తించారు. అలాగే, వారికి సంబంధించి ఆటోమెటిక్, సెమీ ఆటోమెటిక్ ఆయుధాలు, ఇతర ఆయుధ, వస్తు, సామగ్రిని జవాన్లు స్వాధీనపరుచుకున్నారు. కాగా, ఏ ఈడాది ఆరంభం నుంచి ఇప్పటి వరకు ఛత్తీస్‌గఢ్‌లో జరిగిన ఎదురుకాల్పుల్లో 14 మంది మావోయిస్టులు మృతిచెందారు.

మంత్రి ఆగ్రహానికి గెస్ట్‌హౌస్ సిబ్బంది బదిలీ!

– చార్జిషీట్ జారీ చేసిన జీఎం వెల్ఫేర్

కొత్తగూడెం సింగరేణి, జనవరి 12 : తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆగ్రహానికి కొత్తగూడెం కార్పొరేట్ ఇల్లెందు గెస్ట్‌హౌస్ సిబ్బంది బలయ్యారు. శనివారం మంత్రి పాల్వంచ పర్యటనకు వచ్చిన సందర్భంగా కాసేపు విశ్రాంతి తీసుకునేందుకు ఇల్లెందు గెస్ట్‌హౌస్‌కు వెళ్లారు. గెస్ట్‌హౌస్‌లో సిబ్బంది చేసిన ఏర్పాట్లపై అసహనం వ్యక్తం చేయడంతోపాటు గదులు శుభ్రంగా లేవని ఆగ్రహం వ్యక్తం చేసి రికార్డులతో కల్లూరు మండలంలోని నారాయణపురంలో ఉన్న తన ఇంటికి రావాలని ఆదేశించారు. ఆదివారం విచారణ చేసిన మంత్రి సదరు సిబ్బందిని సస్పెండ్ చేయాలని జీఎంకు ఆదేశించారు. జీఎం వెల్ఫేర్ శ్రీనివాసరావు గెస్ట్‌హౌస్ సిబ్బందికి చార్జిషీట్ ఇచ్చినట్లు తెలిసింది.

ఊరెళ్తున్నారా.. జాగ్రత్త!

- పోలీసులకు సమాచారమిస్తే భద్రం
- పండుగ రోజుల్లో పొంచిఉన్న దొంగలు
- స్వీయ జాగ్రత్తలే శ్రేయస్కరం అంటున్న పోలీసులు

అశ్వారావుపేట, జనవరి 12: పండుగ వచ్చిందంటే చాలు దొంగల చేతివాటానికి గట్టి పని తగిలినట్టే. సొంతూళ్ళు, బంధువుల ఇంటికి వెళ్తే ముందు దొంగలకే పండుగ. ప్రజలు ఊరు ప్రయాణం పెట్టుకుంటే దొంగలు ఇంటికి కన్నాలు వేస్తారు. అందుకే ఊరు వెళ్లేటప్పుడు కనీస జాగ్రత్తలు తీసుకోవాలని పోలీసులు సూచిస్తున్నారు. అప్పుడు కనీస భద్రత ఉంటుందని స్పష్టం చేస్తున్నారు. ప్రజలు కూడా స్వీయ జాగ్రత్తలు పాటించడం శ్రేయస్కరం అని హితవు పలుకుతున్నారు పోలీసులు.

సంక్రాంతి పండుగ సెలవులకు దూర ప్రాంతాల్లో ఉన్న ప్రజలు సొంతూళ్ళకు ప్రయాణమవుతారు. అలాగే సొంతూళ్ళలో ఉండే మరికొందరు బంధువుల ఇంటికి పయనమవుతారు. దీనిని ఆసరా చేసుకుని దొంగలు తమ చేతులకు గట్టి పని చెపుతుంటారు. సాధారణ రోజుల్లోనే చోరీలకు ఎగబడే దొంగలు ఇక సెలవురోజుల్లో రెచ్చిపోతుంటారు. ఇలాంటి వారు ముందు జాగ్రత్తగా స్థానిక పోలీసులకు సమాచారం ఇస్తే కొంత నిఘా ఉంటుంది.

సీసీ కెమెరాలు ఉంటే మరీ మంచిది..

దొంగలకు రాత్రి, పగలు తేడా ఉండదు. అవకాశం మేరకు చోరీలకు పాల్పడుతుంటారు. జిల్లా వ్యాప్తంగా నిత్యం ఏదో ప్రాంతంలో చోరీలు జరుగుతూనే ఉంటున్నాయి. పోయిన సొత్తులో రికవరీ పూర్తిగా కాదు. చోరీలు జరగకుండా నియంత్రించటానికి ఒకవేళ చోరీలు జరిగినా నిందితులను త్వరితగతిన గుర్తించేందుకు సీసీ కెమెరాలు పాత్ర ముఖ్యమైనది. అందుకే పోలీసులు సీసీ కెమెరాలు ఏర్పాటుకు ప్రాధ్యాతనిస్తున్నారు. భద్రత దృష్ట్యా ఇళ్లకు సీసీ కెమెరాలు పెట్టుకుంటే మంచిది. పోలీసులు సైతం ఇప్పటికే గ్రామాల్లోని ప్రధాన కూడళ్ళలో దాతలను భాగస్వాములను చేసి సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ఇక ప్రజలు కూడా ఇళ్లకు సీసీ కెమెరాలు పెట్టుకుంటే చోరీల నియంత్రణ ఎలా ఉన్నా నిందితులను గుర్తించటానికి సులభంగా ఉంటుంది.

ప్రయాణంలో విలువైన సొత్తు వద్దు..

ప్రయాణంలో ప్రజలు భారీస్థాయిలో నగదు, బంగారు ఆభరణాలు వెంట తీసుకెళ్లకుండా ఉంటే మేలు. దారి దోపిడీలకు పాల్పడే దొంగల నుంచి ప్రమాదం ఉంటుంది. అలాగే బస్టాండ్లలో దొంగల బెడద ఎక్కువగా ఉంటుంది. బస్సు ఎక్కే హడావిడిలో ఉంటే దొంగలు చేతికి పని చెప్పుకుంటారు. ప్రయాణం చేసేటప్పుడు కూడా అనుక్షణం అప్రమత్తంగా ఉండాలి.

ఇలా చేస్తే మంచిది..

ప్రయాణాలు చేసే ప్రజలు దొంగల నుంచి రక్షణ కోసం స్వీయ జాగ్రత్తలు పాటించాలి.

- ఇతర గ్రామాలకు వెళ్లేటప్పుడు నగదు, బంగారు ఆభరణాలను బ్యాంకు లాకర్లలో భద్ర పరుచుకోవాలి.
- ప్రయాణం చేసేటప్పుడు స్థానిక పోలీసులకు సమాచారం ఇస్తే వారి నిఘా ఉంటుంది.
- ఇంటికి తాళాలు వేసినప్పటికీ తలుపులు కనిపించకుండా కర్టెన్లు వేసుకోవాలి.
- ఇంటి ముందు లైటు వేసి ఉంటే మంచిది.
- పరిసరాల్లో ఉండే వాళ్ళకు ఇంటిని కొంచెం చూస్తూ ఉండాలని చెప్పటం కూడా మేలు చేస్తుంది.

సమాచారం ఇస్తే నిఘా ఉంచుతాం..

ఇతర ప్రాంతాలు, సొంతూళ్లకు వెళ్లే ప్రజలు పోలీస్‌స్టేషన్‌లో సమాచారం ఇస్తే నిఘా ఉంచుతాం. గస్తీ పెంచి చోరీలు జరగకుండా చర్యలు తీసుకుంటాం. అందుబాటులో ఉన్న సిబ్బందితో ప్రత్యేక నిఘా పెంచుతాం. చోరీల నియంత్రణకు ప్రజలు సహకరించాలి.

– యయాతి రాజు, ఎస్సై, అశ్వారావుపేట

ఆఫీసర్ పోస్టుల భర్తీకి పరీక్ష

పరీక్షను పర్యవేక్షిస్తున్న అధికారులు

కొత్తగూడెం సింగరేణి, జనవరి 12: సింగరేణిలో ఖాళీగా ఉన్న జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్ ఈ1 గ్రేడ్, జూనియర్ టెక్నికల్ ఆఫీసర్ సివిల్ ఈ1 గ్రేడ్ పోస్టులను అంతర్గత అభ్యర్థులతో భర్తీ చేసేందుకు ఆదివారం సింగరేణి మహిళా డిగ్రీ , పీజీ కాలేజీలో రాత పరీక్షను అధిఆకరులు నిర్వహించారు. జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్ ఈ1 గ్రేడ్ ఆరు ఖాళీలకుగాను 93 మంది =హాల్ టికెట్లు అందుకున్నారు. వీరిలో 79 మంది హాజరయ్యారు. జూనియర్ టెక్నికల్ ఆఫీసర్ సివిల్ ఈ1 గ్రేడ్‌లో 11 ఖాళీలకుగాను ముగ్గురు హాల్ టికెట్లు అందుకున్నారు. ఆ ముగ్గురూ హాజరయ్యారు. జీఎం (పర్సనల్) కె.శ్రీనివాసరావు, జీఎం (విజిలెన్స్) ప్రసాదరావు పర్యవేక్షించారు.

కొబ్బరి అభివృద్ధి బోర్డు ఏర్పాటు చేయాలి

కొబ్బరి బోర్డు చైర్మన్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఉత్పత్తిదారుల సంఘం బాధ్యులు

అశ్వారావుపేట, జనవరి 12 : తెలంగాణ రాష్ట్రంలో కొబ్బరి అభివృద్ధి బోర్డును ఏర్పాటు చేయాలని కొబ్బరి ఉత్పత్తిదారుల సంఘం బాధ్యులు కొక్కెరపాటి పుల్లయ్య, టి.ఉమా మహేశ్వర్‌రెడ్డి డిమాండ్ చేశారు. కొబ్బరి రైతుల సమస్యల కోసం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బోర్డుపై ఆధారపడాల్సి వస్తుందని వారు పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం రావులపాలెంలో జరిగిన కొబ్బరి అభివృద్ధి బోర్డు 45వ వార్షికోత్సవ వేడుకల్లో చైర్మన్ డాక్టర్ సుభ నాగరాజన్‌కు కలిసి విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర వాప్తంగా 9 వేల ఎకరాల్లో కొబ్బరి తోటలు సాగవుతున్నాయని, ఇందులో 5 వేల ఎకరాలు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోనే సాగులో ఉన్నట్లు వివరించారు. అనంతరం కొబ్బరి రైతుల సమస్యలపై వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కొబ్బరి రైతులు పసుపులేటి ఆదినారాయణ, చక్రధర్‌రెడ్డి, మడిపల్లి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

గ్రామీణ వైద్యులు సామాజిక బాధ్యతతో మెలగాలి

జగదీశ్‌కు నియామకపత్రం అందిస్తున్న వెంకటరెడ్డి

అశ్వారావుపేట, జనవరి 12: గ్రామీణ వైద్యులు సామాజిక బాధ్యతతో మెలగాలని, పరిధికి మించి వైద్యం చేయవద్దని ఆర్ఎంపీ, పీఎంపీ వైద్యుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెంకటరెడ్డి సూచించారు. కేవలం ప్రాథమిక చికిత్స మాత్రమే అందించాలని స్పష్టం చేశారు. స్థానిక భవనంలో ఆదివారం జిల్లా కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఆర్ఎంపీ వైద్యుల సేవల